ప్రజావాణిలో కలెక్టర్‌కు 65 ఫిర్యాదులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు ఎలాంటి జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి ఆదేశించారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలు, బస్తీల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్ మనుచౌదరికి ఫిర్యాదులతో కూడిన అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి వ్యయ, ప్రయాసలకు ఓర్చుకుని తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు కలెక్టరేట్‌కు వస్తున్నారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. తిరస్కరించే దరఖాస్తులకు గల కారణాల ను తప్పనిసరిగా అర్జీదారులకు తెలుపాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో 65 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ మనుచౌదరి ప్రకటించారు. జిల్లా అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న స్పెషల్ ఆఫీసర్ పుష్పలత

కీసర: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని స్పెషల్ ఆఫీసర్ పుష్పలత అన్నారు. వనమహోత్సవంలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో పలు పాఠశాలల విద్యార్థులతో కలిసి ఆమె మొక్కలు నాటారు. అదేవిధంగా ఇంటింటికీ తడి, పొడి వ్యర్థాలు వేరు చేయడం, గృహ కంపోస్టింగ్ అవగాహన, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కమిషనర్ వెంకట్ రెడ్డి, డీఈఈ బాలమురళి, మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

'బీజేఆర్' నూతన కమిటీ

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ బాబు జగ్జీవన్‌రామ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ నూతన అధ్యక్షుడిగా గడిపే సునీల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ నగర్ అభివృద్ధికి పాడుపడుతూ.. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా బాలకృష్ణ, గోపి, రాజేష్, నవీన్, ప్రధాన కార్యదర్శిగా రాజేందర్, సహాయ కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా మహేందర్, ప్రచార కార్యదర్శిగా నిఖిల్, ప్రచార కన్వీనర్‌గా అరుణ్, సభ్యులుగా మహేష్ జోసఫ్‌లను ఎన్నుకున్నారు.

వినాయక చవితి ఘనంగా నిర్వహించాలి

జీహెచ్‌ఎంసీ, పోలీస్, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ మనుచౌదరి

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు నిర్వహించుకునేలా అన్ని శాఖల విభాగాల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్లు హేమంత్, అపూర్వ్, అడిషనల్ డీసీపీలు పురుషోత్తం, సుదర్శన్, స్పెషల్ బ్రాంచ్ అధికారి రెహమాన్, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియలతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వినాయక నిమజ్జనానికి సంబంధించి జిల్లావ్యాప్తంగా 17 చెరువులలో పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవడంతో పాటు అవసరమైన రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రూట్లలో రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టి పూర్తిచేయాలన్నారు. నిమజ్జన ప్రదేశాలలో గతంలో కంటే అధిక సంఖ్యలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. నిమజ్జన స్థలాల వద్ద భారీ క్రేన్లు ఏర్పాటు చేయాలని నిమజ్జనానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పటి నుంచే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అవసరం మేరకు వైద్య శిబిరాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్లతో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించాలని పోలీసులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు, ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి



మేడ్చల్‌రూరల్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాయంలో అధికారులు, నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. మాజీ కౌన్సిలర్ మల్లికార్జున్‌ముదిరాజ్, బీజేపీ రాష్ట్ర నాయకులు విక్రమ్‌రెడ్డి, రాముయాదవ్, అధికారులు, బిల్‌కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు భద్రమేనా?

- రామంతాపూర్ ఘటనపై పెరిగిన భయాందోళనలు
- వర్షాకాలంలో మరింతగా పొంచి ఉన్న ప్రమాదం



ఘట్‌కేసర్‌లో విద్యుత్ స్తంభానికి ప్రైవేటు కేబుళ్లు

ఘట్‌కేసర్: రామంతాపూర్‌లో కృష్ణాష్టమి వేడుకల్లో విద్యుదాఘాతానికి గురైన ఘటన రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ ఘటనలో ఆరుగురు వ్యక్తులు మరణించడంపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పక్షం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నందున ఏ విద్యుత్ స్తంభానికి షార్ట్ సర్క్యూట్ అవుతోందోనని ప్రజలు భయపడుతున్నారు.

పెండింగ్‌లోనే అనేక సమస్యలు..

ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సమస్యలు పరిష్కారించాలని ప్రజలు కోరుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఘట్‌కేసర్, కొండాపూర్, అంకుషాపూర్, నారపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల నుంచి ప్రస్తుతం విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ నేపథ్యంలో రామాంతాపూర్ తరహా ఘటన మరెక్కడ జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం...

ఎక్కడి సమస్యలు అక్కడే...

విద్యుత్ సమస్యలు పరిష్కారించాలని ప్రజలు అధికారులను కోరితే పట్టించుకోవడం లేదు. గతంలో ప్రజలకు తలెత్తిన సమస్యలు విద్యుత్‌శాఖ తన సొంత నిధులతో పరిష్కరించేది. ప్రస్తుతం ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో సమస్యలు కలవరపెడుతున్నాయి. అధికారులకు దృష్టికి తీసుకొస్తే నిధులు లేవనే చెబుతున్నాని అధికారులు అంటున్నారు.

నిధుల లేమితో ఇబ్బంది...

విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిధులు లేమి ప్రధాన అడ్డంకిగా మారింది. రోడ్డుకు అడ్డుగా, మధ్యన ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరుతున్నా.. పనులు చేయడం లేదు. ఇంటిపై వేలాడుతున్న కేబుళ్లు, కాలనీలో తక్కువ ఎత్తులో ఉన్న తీగలు దర్శనమిస్తున్నాయి. వరద నీరు నిలిచే స్థలంలోనే విద్యుత్ ఇనుప స్తంభాలు ఉంటున్నాయి. సమస్యలు పరిష్కారించాలని కోరితే నిధులు లేవని, ఎస్టిమేషన్ వేసి ఇస్తాం, వస్తువులు తెచ్చుకోండి పనులు చేసిపెడతామని అధికారులు చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు.

అడ్డదిడ్డంగా కేబుళ్లు..

మరమ్మతుల సమయంలో ఇంటికి సరఫరా చేసే కేబుల్ లభించాలంటే పెద్ద యుద్ధమే చేయాల్సి వస్తోంది. ఇలా ప్రమాదం జరిగి ఇళ్లల్లోని టీవీలు, ఇతర ఎలక్ట్రిక్ పరికరాలు కాలిపోయిన ఘటనలు కోకొల్లలు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

విద్యుత్‌శాఖ సొంత నిధులతో పనులు చేపట్టాలి. ఇనుప స్తంభాలు ఉన్న దగ్గర సిమెంట్ స్తంభాలు బిగించాలి. రోడ్డు మధ్య ఉన్న స్తంభాలను తొలగించాలి. ఇంటిపై నుంచి వెళ్తున్న తీగలను సరిచేయాలి. ట్రాన్స్‌ఫార్మర్ల రక్షణకు తగిన చర్యలు చేపట్టాలి. జనావాసాలకు దూరంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి. వాటి చుట్టూ ప్రహరీ నిర్మించాలి. ఈ విషయమై ఏఈ యశ్వంత్ కుమార్‌ను వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తామన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే...



విద్యుత్‌శాఖ అధికారులు సక్రమంగా పనిచేయకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉత్సవాల సమయంలో నిర్వాహకులు అనుమతి తీసుకోవాలని నిబంధన విధిస్తారు. సౌకర్యాలు మాత్రం కల్పించరు. రామాంతాపూర్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ మరణాలకు ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యమే కారణం.

– సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఘట్‌కేసర్

తెగిపడిన విద్యుత్ తీగలు... తప్పిన ప్రమాదం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద సోమవారం ఉదయం విద్యుత్ తీగలు తెగిపడగా.. ఆ సమయంలో సమీపంలో ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ప్రాథమిక పాఠశాల సమీపంలో విద్యుత్ స్తంభం నుంచి తీగలు తెగిపడిఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో స్కూల్ విద్యార్థులు తరగతి గదుల్లో ఉండటం, కాలనీల ప్రజలు ఇళ్లలోనే ఉండటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రమాదం జరగకముందే విద్యుత్ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

కీసర రామలింగేశ్వరస్వామికి నాగాభరణం విరాళం





నాగాభరణం అందజేస్తున్న నర్సింహ్మారెడ్డి దంపతులు ఆలయ చైర్మన్, ఈఓ తదితరులు

కీసర: శ్రావణమాసోత్సవ ప్రత్యేక పూజల్లో భాగంగా కీసరగుట్ట రామలింగేశ్వరస్వామివారికి అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయంలో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం అర్చకులు పంచామృత, ఫలరసాభిషేకం పూజలతో పాటు, బిల్వార్చన పూజలను కనులపండువగా నిర్వహించారు.

స్వామివారికి రూ 6.5 లక్షల విలువ చేసే బంగారు తాపడం నాగపడిగే అందజేశారు.


- నగరంలోని తాడ్బండ్‌కు చెందిన సదా నర్సింహ్మారెడ్డి పుష్పలత దంపతులు రూ 6.5 లక్షల విలువ చేసే బంగారు తాపడం గల నాగాభరణం (నాగపడిగేలు) విరాళంగా అందజేశారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, ఈఓ సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు కొకుట్ల కృష్ణారెడ్డి, కందాడి రాజిరెడ్డి, నల్లమధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్‌ముదిరాజ్, రాజుయాదవ్, ఆలయ ప్రధాన అర్చకులు బలరాంశర్మ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. రహదారులు జలమయం !

- స్తంభించిన వాహనాల రాకపోకలు
- వాగుల్లో మత్స్యకారులకు చిక్కిన చేపలు



ఘనాపూర్ వాగులో మత్స్యకారులకు చిక్కిన చేపలు



అలుగు పారుతున్న ఘనాపూర్ వాగు

మేడ్చల్‌రూరల్: భారీ వర్షాల కారణంగా కుంటలు, చెరువులు, లోతట్టు ప్రాంతాలు ఎటు చూసినా వరద నీరు కనిపిస్తోంది. ఆదివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురియడంతో పలు గ్రామాల రోడ్లు జలమయంగా మారాయి. ఇళ్ల మధ్య వరదనీరు నిలవడంతో సోమవారం ఉదయం రోడ్లపై వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

నిలిచిపోయిన రాకపోకలు..

- గండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి గౌడవెల్లి – మేడ్చల్ రోడ్డులో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- పూడూర్–మునీరాబాద్ రోడ్డులో పలు ప్రదేశాల్లో వరదనీరు నిలవడంతో వాహనదారులకు రాకపోకలకు ఆటంకం కలిగింది.
- ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి ఘనాపూర్ వాగు అలుగు పారడంతో జలకళ సంతరించుకుంది. దీంతో సమీప గ్రామాల ప్రజలు పెద్దఎత్తున వాగు వద్దకు చేరుకుని చేపల వేట సాగించారు. మత్స్యకారుల వలకు పెద్దఎత్తున చేపలు లభ్యమయ్యాయి.

పలు గ్రామాలకు రాకపోకలు బంద్..

మేడ్చల్: గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు తోడుగా ఆదివారం రాత్రి మేడ్చల్ లో భారీ వర్షం కురవడంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మేడ్చల్‌లో ఆదివారం రాత్రి 66.4 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు ప్రకటించారు.

- ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్ వద్ద లో లెవల్ బ్రిడ్జి నుంచి నీరు అధికంగా ప్రవహిస్తుండటంతో లింగాపూర్–డబీల్‌పూర్ రూట్‌లలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి, ఎల్లంపేట్ మున్సిపల్ కమిషనర్ నిత్యానందం, మేడ్చల్ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు వివిధ శాఖల అధికారులు చెరువులు, వాగుల వద్ద పరిస్థితిని సమీక్షించి తగిన ఏర్పాట్లు చేశారు. వాగుల నుండి కొత్త నీరు ప్రవహిస్తుండటంతో చేపల వేట జోరుగా సాగింది.

డబుల్ బెడ్రూం వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ కీసర అహ్మద్‌గూడ డబుల్‌బెడ్రూంల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఫేస్–1 కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు విజయ్‌కుమార్, షేక్‌లు అన్నారు. సోమవారం డబుల్ బెడ్రూంల వద్ద రీలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ కీసర మండల నాయకులు బంగారు నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. అహ్మద్‌గూడ డబుల్ బెడ్రూంల వద్ద సరైన సదుపాయాలు లేవని, ఇక్కడి ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. జనరేటర్లను ఏర్పాటుచేయాలని, లీకేజీలను నివారించి మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు డీజే.నర్సింహరావు, సత్యం, అహ్మద్‌గూడ ఫేస్–1 కమిటీ నాయకులు పరుశురాం, మోహన్, వెంకటేష్, చాంద్, లక్ష్మి, సయ్యద్, శ్రీనివాస్, రమణ, ఆరీఫ్, ప్రజాపతి, జ్ఞానేశ్వర్, అశోక్, ఐద్వా జిల్లా నాయకురాలు పూజ తదితరులున్నారు.

ప్రభుత్వ స్కూల్‌లో టీఎల్ఎం మేళా

శామీర్‌పేట్: విద్యార్థులకు సులభమైన పద్ధతిలో అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని మండల విద్యాధికారి కమలాకర్ అన్నారు. తూంకుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టీఎల్ఎం మేళాను మండల విద్యాధికారి కమలాకర్ సోమవారం ప్రారంభించారు. శామీర్‌పేట మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు టీఎల్ఎం మేళాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి కమలాకర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను తయారు చేసి, విద్యాబోధన చేయాలని సూచించారు. స్కూల్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు నాగశారద, ఉపాధ్యాయులు వెంకట్రాంరెడ్డి, మహేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో అడ్మిషన్లకు ఇంటర్వ్యూలు

మేడ్చల్: మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో మొదటి, రెండో విడత కౌన్సెలింగ్‌లలో మిగిలిన సీట్ల భర్తీకి నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హనుమానాయక్ తెలిపారు. వివిధ ట్రేడ్‌లలో మేడ్చల్ ఐటీఐ, ఏటీసీలలో సీట్లు ఖాళీగా ఉన్నాయని గతంలో పేర్లు నమోదు చేసుకున్న వారు, చేసుకోని వారు నేరుగా సంప్రదించి ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ప్రకటించారు. ఈనెల 28లోగా సీట్ల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తున్నట్లు ఆలోగా ఆసక్తి, అర్హత ఉన్నవారు ఐటీఐలో సంప్రదించాలని కోరారు.

వెళ్లేందుకు దారేది.. ?

కాలనీకి దారి కల్పించాలని తూంకుంట మున్సిపల్ ఎదుట ధర్నా

శామీర్‌పేట్: తమ కాలనీకి దారి కల్పించాలని రెడ్డి కాలనీవాసులు సోమవారం తూంకుంట మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తూంకుంట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 286, 322లలో సుమారుగా 30 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, గత 2 నెలల క్రితం కొందరు వ్యక్తులు వెంచర్‌లో ఉన్న దారిని మూసివేసి, బోరు వేసి మామిడి చెట్లు నాటారని ఆరోపించారు. తమ కాలనీకి దారి లేకుండా చేశారని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌కు వినతిపత్రాలు ఇచ్చామని, ఇంతవరకు స్పందించలేదని వాపోయారు. కబ్జాకు గురైన రోడ్డుకు తిరిగి దారి కల్పించాలని అధికారులను కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజాదర్బార్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

సర్వాయి పాపన్నకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ మను చౌదరి తదితరులు



కీసరలో..



ఘట్‌కేసర్‌లో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమాభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, బీసీ అభివృద్ధి శాఖ అధికారి ఝాన్సీరాణి, వివిధశాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

- మేడ్చల్ జోన్ పరిధిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం జరిగిన వేడుకల్లో పలు పార్టీల నేతలు పాల్గొని ఆయన విగ్రహం, చిత్రపటానికి నివాళులర్పించి ఆయన చూపిన మార్గంలో నడవాలని పలువురు సూచనలు చేశారు.

మా పంట భూమిని కాపాడండి !

కలెక్టర్ మనుచౌదరికి రైతు ఫిర్యాదు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఖాజిగూడ రెవెన్యూ శివారులో 12 నుంచి 17, 20, 25 వరకు ,33 నుంచి 36 గల సర్వే నెంబర్లలో 1.30 ఎకరాల పంట భూమి పక్కన ఉన్న ఇతర భూములను కొనుగోలు చేసిన పలువురు వ్యక్తులు దౌర్జన్యంగా తన పంట భూమిని ఆక్రమించుకుని భవన నిర్మాణాలు చేపడుతున్నట్లు బాధిత రైతు ఆరోపించాడు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ మనుచౌదరికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. లే అవుట్ చేసిన సదరు 13.38 ఎకరాల భూమిలో 7 ఎకరాల వరకు లింగాయకుంట చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ భూములు ఉన్నట్లు ఆయన తెలిపారు. హెచ్‌ఎండీఏ మ్యాప్‌లో కూడా లే అవుట్ చేసిన భూములు లింగాయకుంట చెరువు పరిధిలో ఉన్నట్లు చూపిస్తున్నప్పటికీ, అక్రమంగా అనుమతి పొందడంతో పాటు అడ్డుకునేందుకు వెళ్లిన తన కుటుంబసభ్యులపై దాడిచేసి, భవన నిర్మాణాలు చేపడుతున్నారని బాధితుడు ఆరోపించాడు.

కోర్టు ఆదేశాలు పట్టించుకోవడం లేదు..

సదరు స్థలంలో భవన నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని, భూమి స్వరూపాన్ని మార్చకుండా చూడాలని సంబంధిత గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించినా.. పట్టించుకోవడం లేదని వాపోయాడు. సదరు వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సంబంధించిన డాక్యుమెంట్లు, పత్రాలను కలెక్టర్‌తో సహా రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్‌శాఖ అధికారులకు అందజేసినట్లు వివరించారు.

కేబుల్ వైర్ల తొలగింపు !

- నిలిచిపోయిన ఇంటర్నెట్ సేవలు
- నిరసనకు దిగిన కేబుల్ ఆపరేటర్లు



విద్యుత్ స్తంభాల నుంచి తొలగించిన కేబుల్ వైర్లు

మేడ్చల్: అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ప్రైవేటు సంస్థలకు చెందిన కేబుల్ వైర్లను సోమవారం విద్యుత్‌శాఖ అధికారులు తొలగించారు. ఇటీవల నగరంలోని రామంతాపూర్‌లో చోటు చేసుకున్న ఘటన నేపథ్యంతో విద్యుత్ స్తంభాలకు అనధికారికంగా ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను తొలగించటానికి విద్యుత్ శాఖ అధికారులు రంగంలో దిగారు. ఈ మేరకు మేడ్చల్ పట్టణంలోని వీధులు, కాలనీల్లోని విద్యుత్ స్తంభాలకు కుప్పలు తెప్పలుగా ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను తొలగించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యుత్‌శాఖ అధికారులు కేబుల్ వైర్లను తొలగించటంపై ఆపరేటర్లు అధికారులపై మండి పడ్డారు. పూర్తి స్థాయిలో సేవలు స్తంభించి పోయాయని ఆపరేటర్లు వాపోయారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవాటినే తొలగించాం..

నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్‌శాఖ స్తంభాలకు ప్రైవేటు సంస్థలు ఏర్పాటు చేసిన కేబుళ్లను తొలగించే అధికారం తమకు ఉందని మేడ్చల్ ఏఈ రాంబాబు తెలిపారు. విద్యుత్ స్తంభాలకు ప్రైవేటు వ్యక్తులు కేబుళ్లను ఏర్పాటు చేయటానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు ప్రైవేటు కేబుళ్ల ఏర్పాటు చేశారని, ప్రతీ కేబుల్‌ను తొలగిస్తామని ఆయన వివరించారు.

పనులను వినూత్నంగా చేయడమే ఇంజినీరింగ్

మైక్రోసాఫ్ట్ మేనేజర్ ముఖేష్ కుమార్



మాట్లాడుతున్న ముఖేష్ కుమార్

పోచారం: ఇంజినీరింగ్ అంటే సమస్యలకు పరిష్కారాలను కనిపెట్టడం మాత్రమే కాదని, పనులను భిన్నంగా చేయడమని మైక్రోసాఫ్ట్ ఇండియా పరిశోధన విభాగం మేనేజర్ ముఖేష్ కుమార్ అన్నారు. సోమవారం యంనంపేట్‌లోని శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో నూతనంగా చేరిన బీటెక్ విద్యార్థులకు జరిగిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కొన్ని దశాబ్దాల కృషి ఫలితంగా ఇంజినీరింగ్ రంగం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలు సాధించిన ప్రగతితో ప్రపంచంలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. ప్రపంచంలోని 66 శాతం ప్రజలు ఇంటర్నెట్, 96 శాతం ప్రజలు మొబైల్ ఫోన్లను వినియోగిస్తున్నారన్నారు. శరవేగంగా విస్తరించిన సాంకేతిక రంగమే ఈ శుభపరిణామానికి కారణమన్నారు. ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధస్సును అన్ని రంగాల్లో వినియోగిస్తున్నారన్నారు. శ్రీనిధి విద్యాసంస్థల సీఈఓ అభిజిత్‌రావు, ప్రిన్సిపాల్ డా.టీ.సీహెచ్.శివారెడ్డి, అకడమిక్స్ డీన్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను విరమించుకోవాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జవహర్‌నగర్: కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, ఆదివాసీలపై మారణహోమం సృష్టించడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే కాల్పులను విరమించి శాంతి చర్చలు జరపాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 24న ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగసభ వాల్‌పోస్టర్‌ను సోమవారం పీవోడ బ్ల్యూ(విముక్తి) పెర్క సునీత ఆధ్వర్యంలో జవహర్ నగర్ కార్పొరేషన్ అంబేడ్కర్ ప్రధాన చౌరస్తాలో నిర్వహించిన సమావేశంలో ఆవిష్కరించారు.

వరంగల్ సభను విజయవంతం చేయాలి

24న వరంగల్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. షేక్ షావలి, సావిత్రి, మోనార్ దుర్గాప్రసాద్, శివకుమార్, బాలు, కాలేషా, వెంకటచారి, మొయిన్, గౌస్, యాకస్వామి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

పోలీసుల అదుపులో ఒకరు, మరో నిందితుడి పరార్



పోలీసు స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు అదుపులో ఉన్న నిందితుడు

పోచారం: రూట్ వాచ్ చేస్తున్న ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులకు ఓ నిందితుడు గంజాయితో చిక్కాడు. ఇన్‌స్పెక్టర్ జూపల్లి రవి తెలిపిన వివరాల ప్రకారం.. చెర్లపల్లి నుంచి చెంగిచర్లకు వెళ్లే రహదారిపై రూట్ చేస్తున్న పోలీసులకు ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వాహనం నడుపుతున్న కిషోర్ మల్లిక్ (31)ను పోలీసులు అదుపులోకి తీసుకోగా.. వెనకకూర్చున్న అబ్దుల్‌ముజీబ్ (27) ఘటనా స్థలం నుంచి పారిపోయాడు. వాహనాన్ని తనిఖీ చేయగా.. పెట్రోల్ ట్యాంక్‌పై ఉన్న బ్యాక్‌ప్యాక్ బ్యాగులో ఎండు గంజాయి లభ్యమైంది. అదుపులో ఉన్న కిషోర్‌మల్లిక్‌ను ప్రశ్నించగా.. తాను ఒడిశాలోని మల్కాజిగిరికి చెందిన వ్యక్తినని, ఒడిశా నుంచి ఎండు గంజాయిని కొనుగోలు చేసి, బస్సులో హైదరాబాద్‌కు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు చెప్పాడు. మరో నిందితుడు ముజీబ్ నగరంలోని మౌలాలిలో ఉంటున్నట్లు సమాచారం. ముజీబ్‌పై గతంలో ఉప్పల్ ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఘటనా స్థలంలో లభించిన 4.900 కిలోల ఎండు గంజాయి, ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు.